Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కాదే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 6 సంచిక (Issue) : 322 పేజీలు (Pages) : 4 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

గురువారం, 1 - 5 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 స్థాపితం : 2015

# గోడ కూలి ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరం




**న్యూఢిల్లీ:** ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం, సింహాచలం చందనోత్సవం సందర్భంగా గోడ కూలిన ఘటనపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పందించారు. ప్రాణనష్టం జరగడం చాలా బాధాకరమని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు పిఎం ఎన్ఆర్ఎఫ్ నుండి రూ. 2 లక్షల పరిహారం ప్రకటించారు. అలాగే గాయపడిన వారికి రూ. 50,000 అందజేస్తామని ప్రధాని మోదీ వెల్లడించారు.

**రాహుల్ గాంధీ సంతాపం..**

విశాఖపట్టణం, సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలి.. పలువురు మృతిచెందిన ఘటనపై పార్లమెంట్ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. పలువురు మృతి చెందడం తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సంతాపం తెలియజేసినట్లు సోషల్ మీడియా ట్విట్టర్ వేదికగా ఆయన పేర్కొన్నారు.

**సింహాచలం ఘటనపై కిషన్ రెడ్డి స్పందన..**

విశాఖపట్టణం, సింహాచలం ఆలయ ప్రాంగణంలో గోడ కూలిన ఘటనలో పలువురు మృతి చెందిన ఘటన తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. పవిత్రమైన అక్షయ తృతీయ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు రావడం, ఈ సందర్భంలో గోడ కూలి ప్రాణనష్టం జరగడం విచారకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. కాగా సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో అపశృతి చోటు చేసుకుంది. రూ. 300 టికెట్ కౌంటర్ దగ్గర గాలి, వానకు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో 8 మంది భక్తులు మృతి చెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. సంఘటన ప్రదేశానికి చేరుకున్న రిస్క్యూ సిబ్బంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, మృతదేహాలను కేజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు.

**మే 2న ఏపీ పర్యటనకు మోదీ..**

కాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతి పనుల పునః ప్రారంభానికి మే 2న రానున్నారు. అమరావతిలో ప్రధాని ఆవిష్కరించాల్సిన పనులు, మోదీ పర్యటన వివరాలపై సిఎం చంద్రబాబుకు మంత్రి నారాయణ, సిఆర్డీఏ కమీషనర్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సుమారు లక్ష కోట్ల రూపాయలు పనులను ప్రధాని అమరావతిలో పట్టాలు ఎక్కించనున్నారు. వివిధ పనులకు శంఖుస్థాపనలు చేయనున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతిలో పైలాన్ ఆవిష్కరణకు ఏర్పాట్లు చేస్తున్నారు. పైలాన్‌పై ఏపీ రాష్ట్ర చిహ్నం బంగారు వర్ణంలో ఉన్న పూర్ణకుంభంతో ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఆరుమీటర్ల ఎత్తుతో పైలాన్ ఏర్పాట్లు ఉండనున్నాయి. పైలాన్‌పై కార్యక్రమ, అతిథుల వివరాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా




**అమరావతి, (రాజధాని వార్తలు):** సింహాచలం ఘటనలో మృతుల కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా ప్రకటిం చింది. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే క్షతగాత్రులకు రూ.3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. బాధిత కుటుంబ సభ్యులకు దేవాదాయశాఖ పరిధిలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించింది.

**మృతులకు నా ప్రగాఢ సానుభూతి..**

కాగా సింహాచలం ప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, డోలా బాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ఎంపీ భరత్, సింహాచల దేవాలయ ధర్మకర్త అశోక్ గజపతి రాజు తదితరులు పాల్గొన్నారు. సింహాచలం ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి ఘటన జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సాయం వివరాలు ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. గోడ కూలిన ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణకు ఆదేశించారు. చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.


**మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి.. మంత్రి నిమ్మల**

సింహాచలం ప్రమాద ఘటనపై మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. సింహాచలం చందనోత్సవంలో గోడ కూలి భక్తులు మృతి చెందడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. భాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందిన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయం అందుతుందని చెప్పారు. మృతుల కుటుంబాలకు మంత్రి నిమ్మల తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కాగా సింహాచలంలో ఘోర ప్రమాదం జరిగింది. చందనోత్సవం వేళ అప్పన్న సన్నిధిలో అపశృతి చోటు చేసుకుంది. రూ. 300 టికెట్ కౌంటర్ దగ్గర గాలి, వానకు గోడ కూలిపోయింది. ఈ ఘటనలో 8 మంది భక్తులు మృతి చెందారు. మరో 10 మందికి తీవ్రగాయాలు అయ్యాయి. శిథిలాల కింద మరికొందరు ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల్లో ముగ్గురు మహిళలు ఉన్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. సంఘటన ప్రదేశానికి చేరుకున్న రిస్క్యూ సిబ్బంది ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సహాయక చర్యలు చేపట్టారు. ఘటనా స్థలానికి చేరుకున్న హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, మృతదేహాలను కేజీహెచ్ ఆస్పత్రికి తరలిస్తున్నారు.

# వృద్ధురాలిది హత్యే.. తేల్చేసిన తిరుపతి పోలీసులు

**తిరుపతి, (రాజధాని వార్తలు):** జిల్లాలోని జీవకోనలో జరిగిన వృద్ధురాలి మృతిపై పోలీసులు పురోగతి సాధించారు. ఈనెల 11న జీవకోన, రాఘవేంద్ర నగర్‌లో సిరివెళ్ల శాంతమ్మ (64) అనే వృద్ధురాలి మృతి తీవ్ర కలకలం రేపింది. అయితే అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా.. పోలీసుల దర్యాప్తులో అసలు విషయాలు బయటపడ్డాయి. సిరివెళ్ల శాంతమ్మది హత్యే అని పోలీసులు తేల్చేశారు. డబ్బును కాజేసేందుకు వృద్ధురాలిని హత్య చేసినట్లు పోలీసుల విచారణలో బయటపడింది. ఈ హత్యలో ఐదుగురిని నిందితులుగా గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.13 లక్షల విలువగల 129 గ్రాముల బంగారం, వెండి నగలు, రూ.35 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం ఈరోజు (బుధవారం) మీడియా సమావేశం నిర్వహించి.. శాంతమ్మ హత్యకు సంబంధించిన వివరాలు.. ఎందుకు హత్య చేశారో తెలియజేశారు. నిందితుల్లో ఏ1, ఏ2లు వృద్ధురాలు ఉండే భవనంలో రెండవ అంతస్థులో అద్దెకు ఉన్నారు. ఈ క్రమంలో నాలుగవ అంతస్థులో నివాసముంటున్న యజమాని శాంతమ్మతో చనువుగా ఉన్నారు. ఆమె వద్ద భారీగా బంగారం, నగదును గుర్తించిన నిందితులు శాంతమ్మను హత్య చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ క్రమంలో పథకం ప్రకారమే హత్య చేసి ఆపై దాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించారు. హత్య అనంతరం ఇంటిలో ఉన్న బంగారు నగలు, డబ్బు తీసుకుని నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు.. చివరకు శాంతమ్మను డబ్బు కోసం దారుణంగా హత్య చేసినట్లు నిర్ధారించారు.

# జనసేన పార్టీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు




**తాడేపల్లిగూడెం, (రాజధాని వార్తలు):** తనతో ఉన్న కొంత మంది నాయకులు తాను చనిపోవాలని కోరుకుంటున్నారంటూ తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే, జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తాను ఎన్డీఏ ఎమ్మెల్యేని.. తాను చనిపోతే ఉప ఎన్నిక వస్తే.. కొంత మంది ఎమ్మెల్యే అయిపోవాలని చూస్తున్నారంటూ ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఎవరు త్యాగాల వల్ల తనకు ఎమ్మెల్యే సీటు రాలేదన్నారు. మూడు పార్టీలు కలిసి తనకు మ్యాండేడ్ ఇచ్చాయని ఆయన గుర్తు చేశారు. తాను గెలిచిన తర్వాత తాడేపల్లిగూడెం నియోజకవర్గ ప్రజల కోసం పని చేస్తున్నానన్నారు. అధికారులను ఇబ్బంది పెట్టి.. వారిని బెదిరిస్తే సహించేది లేదని.. వారిని కాపాడుకుంటానని ఆయన స్పష్టం చేశారు. తాను చనిపోయిన తర్వాత మీరు ఎమ్మెల్యే అవ్వాలని కోరుకుంటున్నానన్నారు. తనకు పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ మండేట్ ఇస్తే.. తాడేపల్లిగూడెం ప్రజల వల్ల ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. ఎవరి దయ దక్షిణ్యాల వలన తాను గెలవలేదని తెలిపారు. మరో పిఠాపురం చేసేస్తానంటున్నారని.. తానేమీ చేతికి గాజులు తొడుక్కోలేదన్నారు. తాను స్థలాలు, పొలాలు పూడ్చ లేదని.. కానీ తనకు ఓట్లు వేసి గెలిచిపించిన ప్రజల కోసం తాను పని చేస్తున్నానంటూ ఆయన కుండబద్దలు కొట్టారు. తెలుగుదేశం పార్టీలో ఏ కార్యకర్తను తాను ఇబ్బంది పెట్టలేదన్నారు. కానీ శాసన సభ్యుడిగా మాత్రం గౌరవం ఇవ్వండంటూ కూటమిలోని మిత్ర పక్ష పార్టీ నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఇస్లామాబాద్, లాహోర్‌లో నో-ఫ్లై జోన్ ప్రకటించిన పాక్




**న్యూఢిల్లీ:** పహల్గాంలో ఉగ్రవాదులు నరమేధానికి పాల్పడి 26 మంది టూరిస్టులను కాల్చిచంపిన తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఏ క్షణంలోనైనా భారత్ సైనిక చర్యకు దిగవచ్చంటూ పాక్ నేతలు బహిరంగంగా ప్రకటిస్తూనే, గట్టి గుణపాఠం చెబుతామనే రీతిలో మాట్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా పాక్ ప్రభుత్వం ఇస్లామాబాద్, లాహోర్‌లో నో-ఫ్లై జోన్‌ను ప్రకటించింది. మే 2వ తేదీ వరకూ ఇది అమలులో ఉంటుందంటూ 'నో టు ఎయిర్‌మన్' (నోటమ్) నోటీసు జారీ చేసింది. ఆ ప్రకారం నిర్దేశిత గగనతలంలోకి ఏ విమానం కూడా ప్రవేశించరాదు. జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడికి గట్టి జవాబిస్తామంటూ భారత్ విస్పష్టంగా ప్రకటించడంతో ఇస్లామాబాద్, లాహోర్ ఎయిర్‌స్పేస్‌లో ఈ నోటమ్ నోటీసును పాక్ జారీ చేసింది. రాబోయే 24 నుంచి 36 గంటల్లో మిలటరీ దాడులకు భారత్ వ్యూహరచన చేస్తున్నట్టు ఇంటెలిజెన్స్ సమాచారం తమ వద్ద ఉందని పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అతావుల్లాహ్ తరార్ తాజాగా సంచలన వ్యాఖ్యలు చేశారు. హహల్గాం దాడిలో పాక్ ప్రమేయం ఉందంటూ న్యూఢిల్లీ కల్పిత, నిరాధార ఆరోపణలు చేస్తోందని, సైనిక దురాక్రమణ చర్యలకు పాల్పడేందుకే ఈ వాదనలు చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆయన వ్యాఖ్యల నేపథ్యంలో ఇస్లామాబాద్‌లో గుబులు మొదలైనట్టు తెలుస్తోంది. కాగా, పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాక్‌పై భారత్ కఠిన చర్యలకు దిగడంతో పాకిస్థాన్ సైతం భారత్‌పై కఠిన చర్యలు ప్రకటించింది. ఇందులో భాగంగా భారతదేశ విమానాలకు తమ ఎయిర్‌స్పేర్‌ను మూసేస్తున్నట్టు ఇటీవల ప్రకటించింది.

# పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల




**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** తెలంగాణలో 10వ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం మధ్యాహ్నం 2.15 గంటకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. రవీంద్ర భారతిలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ ఫలితాలను ఆయన రిలీజ్ చేశారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 92.78 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గురుకులాల్లో 96 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. గత ఏడాదితో పోలిస్తే 1.47 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు అయ్యింది. బాలురు 91.32 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలికలు 94.26 శాతం ఉత్తీర్ణత పొందారు. ఈసారి కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికల కంటే బాలురు 2.94 శాతం అధికంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది 4,629 పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి. అలాగే రెండు పాఠశాలలు మాత్రం సున్నా శాతం ఫలితాలు పొందాయి. టెన్త్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా 99.29 శాతంతో ప్రథమ స్థానంలో ఉండగా.. వికారాబాద్ జిల్లా 73.97 శాతంతో చివరి స్థానంలో నిలిచింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు తెలంగాణలో పదో తరగతి పరీక్షలు జరిగాయి. దాదాపు 5 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడం.. మార్కుల మెమోలను ఎలా ఇవ్వాలన్న అంశంపై ఇప్పటికే అధికారులకు పూర్తిస్థాయి స్పష్టత వచ్చింది. దీంతో ఈ పరీక్ష ఫలితాలు ఈరోజు విడుదల చేశారు.

# కోదాడ ఖబరస్థాన్‌లో బయటపడ్డ పురాతన శాసనాలు

**కోదాడ, (రాజధాని వార్తలు):** కోదాడలోని పాత ఖబరస్థాన్‌లో పురా తన శాసనలు బయటపడ్డ ఘటన చోటు చేసుకుంది. శవాన్ని పూడ్చుడానికి గొయ్యి తీసే క్రమంలో శాసనాలు బయటపడగా స్థానికులు పోలీస్ మరియు రెవిన్యూ అధికారులకు సమాచారం అందిచడంతో వాటిని పరిశీలించి పురావాస్తు శాఖకు అందిం చినట్లు తహసీల్దార్ పేర్కొన్నాడు. బయటపడిన శాసనాలు తమిళంలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

# భూ భారతి చట్టం రైతులకు న్యాయం చేసే దిశగా కీలక అడుగు

## - ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డా.రామచందర్ నాయక్





**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** భూ రికార్డుల సవరణ, సాదా బైనామాల పరిష్కారం, రైతులకు మెరుగైన సేవలందింపు వంటి అంశాల్లో భూ భారతి చట్టం ధరణి కంటే మెరుగైనదిగా నిలుస్తుందని ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డాక్టర్ రామచందర్ నాయక్ తెలిపారు. దంతాలపల్లి మండలంలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహిం చిన భూ భారతి అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో భూ భారతి చట్టంలోని ముఖ్యాంశాలను అధికారులు రైతులకు వివరించి, రైతులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా డా.రామచందర్ నాయక్ మాట్లా డుతూ, 1971లో ఆర్‌ఓఆర్ చట్టం, 2020లో ధరణి తర్వాత, భూ సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి 2025లో భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం తీసుకు వచ్చిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 లక్షల సాదా బైనామా దరఖా స్తులకు పరిష్కారం చూపేందుకు ఇది మార్గం సుగమం చేస్తుం దని తెలిపారు.

రైతులకు న్యాయం జరగాలంటే ఆన్లైన్ మాని టరింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, దరఖాస్తుల నుండి స్లాట్ బుకింగ్ వరకు అన్ని ప్రక్రియలు పూర్తిగా ఆన్లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి సూచించారు. వ్యవస్థలో వ్యక్తిగతంగా తప్పులు జరిగే అవకాశం లేకుండా, అవినీతి రహితంగా సేవలు అందించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. అంతేకాకుండా, రెవెన్యూ సిబ్బంది రైతుల పట్ల సహానుభూతి, నిష్పాక్షికతతో పనిచేసే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

# స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, ద్వారా గ్రామీణ, విద్యా సంస్థలలో, మరుగుదొడ్లు నిర్మించాలి

## - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, ద్వారా గ్రామీణ, విద్యా సం స్థలలో, మరుగుదొడ్లు నిర్మించాలన్నారు, జిల్లా కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, సంబంధిత అధికారు లతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ గ్రామీణ మిషన్ ద్వారా మంజూరైన పథకాలను గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం స్వచ్ఛత సంరక్షణ పారిశుద్ధ్యం పరిశుభ్రత పాటించడం శ్రేష్ఠ భారత్ మిషన్ ద్వారా గ్రామీణ పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, రైతు వేదికలు, గ్రామ పంచాయతీ భవనాలలో, జనసంచారం అధికంగా ఉన్న ప్రదేశాలలో వారి సౌకర్యార్థం స్త్రీ, పురుషులకు వేరువేరుగా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రహిత గ్రామాలుగా వ్యర్థాల నిర్వహణ క్రమబ ద్ధీకరణ అంశాలు, సెగ్రిగేషన్ చేయాలన్నారు. గ్రామాలు పట్టణాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవడం, డంపింగ్ యార్డ నిర్వహణ, వ్యక్తిగత మరుగుదొడ్లు కమ్యూనిటీ మరుగుదొడ్లు, నిర్మించాలని,



ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని సూచించారు. జిల్లాకు కేటాయించిన స్వచ్ఛ భారత్ మిషన్ లక్ష్యాలను అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి పూర్తి చేయాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధు సూదనరాజు, జెడ్పి సీఈవో పురుషోత్తం, డి ఏ ఓ విజయనిర్మల, డిఇఓ రవీందర్ రెడ్డి, డిపిఓ హరిప్రసాద్, వెల్ఫేర్ అధికారిని ధనమ్మ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి దేశిరామ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రవి, డి డి గ్రౌండ్ వాటర్ సురేష్, స్వచ్ఛభారత్ ఎస్బిఎంలు శ్రీమాన్, రవికుమార్, మిషన్ భగీరథ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ జేఎన్టీయూహెచ్ కళాశాలలోని సమస్యలు పరిష్కరించాలి

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** ఎస్ ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గందసిరి జ్యోతిబసు, పట్ల మధు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జెఎన్టియు కాలేజీలోని సమస్యలు అడిగి తెలుసుకున్న జిల్లా నాయకత్వం ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సింహద్రి,జిల్లా సహాయ కార్యదర్శి నిక్షిప్త, పట్టణ కార్యదర్శి రాకేష్ నాయకులు జేఎన్టీయూ కాలేజ్ నాయకులు వాసు, గణేష్, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.



# ఎమ్మెల్సీ అద్దం దయాకర్ ఘనంగా సన్మానించిన మాలమహానాడు నాయకులు

**ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల బ్యూరో, (రాజధాని వార్తలు):** మహ బూబాబాద్ జిల్లా వీఆర్ఎన్ గార్డెన్‌లో రాజ్యాంగ పరిరక్షణ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమ కారుడు నూతన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ వారి సతీమణి లకు సన్మాన సభ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్ర మంలో వారి దంపతులకు కురవి మండల మాల మహానాడు అధ్యక్ష కమిటీ తరఫున సాలువాతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, మాల మాహానాడు మండల



అధ్యక్షుడు కామిండ్ల వీరన్న గ్రామ అధ్యక్షుడు కామిండ్ల ఆనందం మాల నాయకులు తిరుపతి ప్రభాకర్ రాచమల్ల నర్సయ్య గాజుల చిన్ని గాజుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ శ్రీకృష్ణదేవరాయలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాపునాడు ఉదయ్ భాస్కర్

**నరసరావుపేట, (రాజధాని వార్తలు):** దాచేపల్లి నరసరావు పేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలకు జన్మదిన సందర్భంగా కాపునాడు గుంటూరు పలనాడు జిల్లాల అధ్యక్షుడు కురియాల ఉదయభాస్కర్ జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు చిన్న వయసులోని రెండుసార్లు ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిచి పలనాడు జిల్లా అభివృద్ధికై తన సాయి శక్తుల కృషిచేసి ఎన్నో మంచి పనులు చేసి ప్రజల హృదయా లలో తనకంటూ చెరగని ముద్ర వేసు కొన్న మంచి వ్యక్తి విద్యావంతుడు అయినటువంటి లావు శ్రీకృష్ణదేవరాయలు ఇంకా ఎన్నో ఉన్నతమైన పదవులు చేపట్టి ప్రజలకు అండ దండగా నిలవాలని ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆ భగవంతుని కోరుచున్నా ఉదయ్ భాస్కర్.

# గిరిజన యానాదులకు, వలసలు లేకుండా ప్రభుత్వం జీవనాధారం కల్పించాలి : యానాదులు సంఘ నేత శివాజీ బోది

**నెల్లూరు రూరల్, (రాజధాని వార్తలు):** చేపలు, ఎలుకలు పట్టి జీవ నాధారంతో బతుకుతున్న యానాదులు కొన్ని కుటుంబాలు, వారు జీవనదారం లేక గ్రామాలను వదిలి వలస వెళ్లేందుకు సిద్ధమవుతున్నారని యానాదుల సంఘం నేత శివాజీ బోది అన్నారు. మంగళవారం నెల్లూరు రూరల్ కొమ్మలపూడి గ్రామంలో ఉన్న గిరిజన యానాదులు వలసబాట పట్టేందుకు సిద్దంగా ఉన్న నేపథ్యంలో వారిని గుర్తించి ఉన్నత అధికారులు దృష్టికి తీసుకొని పోతున్నట్లు చెప్పారు. ప్రధానంగా వేసవిలో వాగులు, వంకలు, చెరువులు, కాలువల్లో చేపలు పట్టేందుకు నీళ్లు లేకపోవడంతో ఇలాంటి పరిస్థితి వచ్చిందని వీరికి ప్రభుత్వం జీవనాదారం కల్పించాలని డిమాండ్ చేసారు. అంత్యోదయ కార్డులు ద్వారా 35 కేజీలు బియ్యం ఇవ్వాలని ప్రభుత్వం జిల్లా మండల అధికారులు వెంటనే స్పందించి యానాదులకు న్యాయం చేయాలని కోరారు. బ్రతుకు జీవనం కోసం సొంత ఊర్లు వదిలి వలసలు వెళుతున్న యానాదులు, గిరిజన నిరుపేద యానాదులు ఆయా గ్రామాలలో కొంత మంది చేపలు పట్టి జీవిస్తూ చేపలు పట్టి అమ్ముకుని వారి కుటుంబ పోషణ జీవించడమే వారి ముఖ్య వృత్తిగా ఎంచుకొని ఉన్న కుటుంబాలు ఉన్నాయి వారికి ఎండాకాలంలో చేపలు



దొరకక కాలవల్లో గుంటల్లో నీళ్లు ఎండిపోవడంతో వారికి జీవనాధారం లేకపోవడంతో సొంత ఊరు వదిలి వలసలు వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. అలాంటి వారిని గుర్తించి ప్రభు త్వం ఆదుకోవాలని యానాదుల సంఘం కోరిందన్నారు. కొండ్లపూడి ఎస్‌టి కాలనీలో ఇలాంటి పరిస్థితులు ఎదురు అవుతోందని గుర్తు చేసారు. ఈ కార్యక్రమంలో మల్లిక మల్లికార్జున యానాదుల సంఘ నాయకులు మరియు శివాజీ బోధి సీనియర్ నాయకుడు మరియు యానాది మహానాడు ఆల్ ఇండియా నెల్లూరు జిల్లా అధ్యక్షులు చౌటూరు శీనయ్య, తదితరులు ఉన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి ఆనం, రామ నారాయణ రెడ్డి



**నెల్లూరు/ఆత్మకూరు, (రాజధాని వార్తలు):** మే 1న ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు ఆత్మకూరు పర్యటన సందర్భంగా సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్, కలెక్టర్, ఓ.ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం ఏర్పాట్లను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పరిశీలించడం జరిగింది. ఆత్మకూరు బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద హెలీప్యాడ్, నారంపేట ఎంఎస్ఎం ఈ పార్క్ ఆవిష్కరణ కార్యక్రమం, నెల్లూరు పాలెం వద్ద గిరిజన కాలనీలో పింఛన్ల పంపిణీ ఏర్పాట్లను పరిశీలించారు. పార్టీ కార్యకర్తల సమావేశం కోసం బీసీ బాలికల గురుకుల పాఠశాల మైదానాన్ని మంత్రి, సీఎంఓ టీం, అధికారులు పరిశీలించి ఎంపిక చేశారు.సీఎం ప్రజావేదిక సభ కోసం ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మైదానం, వాటర్ ట్యాంక్ సమీపంలోని మున్సిపల్ పార్కు స్థలం, రవితేజ కళ్యాణ మండపం సమీపంలోని స్థలాన్ని పరిశీలించి రవితేజ కళ్యాణమండపం సమీపంలోని ప్రైవేటు స్థలాన్ని మంత్రి, అధికారులు ఎంపిక చేశారు. ఆర్డీవో పావని, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, ఆర్ అండ్ బి ఎస్ ఈ గంగాధర్, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డిఆర్డిఏ పిడి నాగరాజుకుమారి, తెలుగు గంగ ఎస్ఈ స్థానిక టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు. మండుటెండను సైతం లెక్క చెయ్యకుండా మంత్రి పరిశీలించడం జరిగింది.

# రష్మిక.. డిజాస్టర్ దెబ్బ పోవాలంటే ఈసారి కొట్టాల్సిందే..



ఇటీవల బాలీవుడ్‌లో అద్భుతమైన విజయాలను అందుకున్న నటి రష్మిక మందన్నా, ప్రస్తుతం కొత్త సవాలును ఎదుర్కొంటోంది. 'పుష్ప 2', 'అనిమల్', 'ఛావా' వంటి సినిమాలతో వరుసగా 500 కోట్ల క్లబ్‌లో ఎంట్రీ ఇచ్చిన రష్మిక, బాలీవుడ్‌లో దీపికా పదుకొణె, ఆలియా భట్‌లను కూడా ఓడించినట్టు ట్రేడ్ విశ్లేషకులు పేర్కొన్నారు. కానీ ఈ గ్లోరీస్ జర్నీకి మధ్యలో 'సికందర్' రూపంలో ఓ పెద్ద బ్రేక్ తగిలింది. సల్మాన్ ఖాన్ సరసన నటించిన 'సికందర్' సినిమా కథాపరంగా విఫలమైంది. కంటెంట్‌లో పస లేకపోవడం, రష్మిక పాత్ర రెగ్యులర్ ట్రాక్‌లో ఉండటంతో విమర్శలు వెల్లువెత్తాయి. ట్రోలింగ్‌ను ఎదుర్కోవడం రష్మికకు పెద్ద షాక్‌గా మారింది. ఇక ఈ కామెంట్స్‌ను దాటి మళ్లీ రష్మిక సత్తా చూపించాలంటే మరో సాలీడ్ హిట్ అందుకోవాల్సిన అవసరం ఉంది. ఇక ఇప్పుడు హోప్స్ అన్నీ 'థామ' మీదే ఉన్నాయి. మాడాక్ ఫిలింస్ నిర్మిస్తున్న ఈ హారర్ కామెడీ ప్రాజెక్ట్‌లో రష్మిక, ఆయుష్మాన్ ఖురానా జోడీగా నటిస్తున్నారు. ప్రస్తుతం ఊటీ కొండల్లో షూటింగ్ జరుగుతోంది. హారర్ ఎలిమెంట్స్ మిక్స్‌తో ఉన్న కామెడీ ట్రాక్‌తో మాడాక్ సంస్థకు మంచి ట్రాక్ రికార్డు ఉంది. ఈ ప్రొడక్షన్‌లో వచ్చిన స్త్రీ సీరీస్, బెడియా, ముంజ్యా సినిమాలు వందల కోట్లు రాబట్టయి. ముఖ్యంగా స్త్రీ 2 800 కోట్లు రాబట్టింది. అందుకే 'థామ'పై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక దీపావళి సీజన్‌లో, అక్టోబర్ 19న విడుదల కాబోతున్న ఈ సినిమా రష్మికకు కీలక పరీక్షగా మారనుంది. సికందర్ ఫెయిల్యూర్ తరువాత ఆమెను తిరిగి స్టార్ రేసులో నిలబెట్టే అవకాశం ఇది. అదే సమయంలో బాలీవుడ్ ప్రేక్షకుల్లో కొత్తగా యూత్ ఫేవరైట్‌గా నిలబడేందుకు రష్మికకి ఇది మంచి ఛాన్స్. 'థామ'లో ఆమె పాత్రను బలంగా రాసారని, స్క్రీన్ టైమ్ కూడా మెరుగుగా ఉంటుందని సమాచారం. మరో ఆసక్తికర అంశం ఏమిటంటే, ఇప్పటివరకు రష్మిక నటించిన పాన్ ఇండియా సినిమాల్లో మాస్ అవుట్‌పుట్ ఎక్కువగా కనిపించేది. కానీ 'థామ' వంటి హారర్ కామెడీ సినిమాతో ఆమె నటనలో న్యూ సైడ్ చూపించబోతున్నారు. ఆ పాత్రను ఆమె ఎంతవరకు విజయవంతంగా మోస్తుందన్నదే ఈ ఫెస్టివల్ బాక్సాఫీస్ వార్‌లో కీలకం కానుంది. మొత్తంగా చూస్తే, 'థామ' రష్మికకు మరో మేజర్ టర్నింగ్ పాయింట్ అవుతుంది. దీపావళి బాక్సాఫీస్‌లో ఈ సినిమా సూపర్ హిట్ అయితే, 'సికందర్' వలయాన్ని పూర్తిగా చెరిపేసి మళ్లీ రష్మికను బాలీవుడ్ క్వీన్‌గా నిలబెట్టొచ్చు. కానీ మరోసారి ఫ్లాప్ ఎదురైతే మాత్రం, కొత్త వారితో పోటీ మరింత కఠినం కావడం ఖాయం.

# మాస్ రాజాతో డైరెక్టర్ బాకీ అలానే ఉందా..?



కొన్ని కాంబినేషన్‌లో సినిమాలు ఆడియన్స్‌కి మంచి కిక్ ఇస్తాయి. అలాంటి కాంబినేషన్‌లో ఒకటి మాస్ మహారాజ్ రవితేజ, డైరెక్టర్ గోపీచంద్ మలినేనిది. గోపీచంద్ తో డాన్ శీను, బలుపు, క్రాక్ సినిమాలు చేశాడు రవితేజ. క్రాక్ సినిమా సూపర్ హిట్ అయ్యింది. అవ్వడమే కాదు రవితేజని తిరిగి సక్సెస్ ఫాంలోకి తెచ్చింది. క్రాక్ తర్వాత మళ్లీ గోపీచంద్, రవితేజ కాంబో సినిమా ఒకటి అనుకున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్ లో సినిమా అనౌన్స్ కూడా చేశారు. కానీ ఏమైందో ఏమో ఆ సినిమా సెట్స్ మీదకు వెళ్లకుండానే ఆగిపోయింది. ఆ తర్వాత బాలకృష్ణతో వీర సింహారెడ్డి తీసిన గోపీచంద్ మలినేని సన్నీ డియోల్‌తో జాత్ అంటూ బాలీవుడ్ సినిమా తీసి సక్సెస్ అందుకున్నారు. సన్నీ డియోల్‌లోని మాస్ పొటెన్నియల్‌ని పర్ఫెక్ట్‌గా వాడుకుని గోపీచంద్ హిట్ కొట్టాడు. ఇక ఇప్పుడు గోపీచంద్‌కి బాలీవుడ్ నుంచి కూడా ఆఫర్లు వస్తున్నాయని తెలుస్తుంది. ఐతే నెక్స్ట్ గోపీచంద్ మలినేని మరోసారి బాలయ్యని డైరెక్ట్ చేయబోతున్నారు. ఈ సినిమా కూడా నెక్స్ట్ లెవెల్ మాస్ మూవీగా ఉంటుందని తెలుస్తుంది. ఇక ఈ సినిమా తర్వాత క్రాక్ 2 ఉండే ఛాన్స్ ఉందని అంటున్నారు. రీసెంట్‌గా గోపీచంద్ మలినేని ఇంటర్వ్యూలో రవితేజతో సినిమా ఉంటుందని అది క్రాక్ 2 అవుతుందా లేదా అన్నది తర్వాత తెలుస్తుందని అన్నారు. ఈసారి రవితేజతో చేసే సినిమా మాత్రం మాస్ రాజా ఫ్యాన్స్‌కి స్పెషల్ ట్రీట్ ఇచ్చేలా ఉంటుందని అన్నాడు గోపీచంద్ మలినేని. సో రవితేజతో ఆల్రెడీ ఆయనది సూపర్ హిట్ కాంబో కాబట్టి తప్పకుండా ఈ ఇద్దరు మరోసారి అదరగొట్టేస్తారని అనిపిస్తుంది. రవితేజ ప్రస్తుతం మాస్ జాతర సినిమా చేస్తున్నారు. ఈ సినిమా తర్వాత మరో సినిమా లైన్‌లో ఉంది.

మరోపక్క గోపీచంద్ మలినేని కూడా బాలకృష్ణతో సినిమా పూర్తి చేశాక రవితేజతో సినిమా చేసేలా ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి క్రాక్ కాంబో మళ్లీ కలిస్తే మాత్రం మాస్ ఆడియన్స్‌కి ఫుల్ మీల్స్ పక్కా అని చెప్పొచ్చు. మరి ఈసారి ఎలాంటి కథతో ఈ ఇద్దరు కలిసి వస్తారన్నది చూడాలి. రవితేజకి మళ్లీ ఒక మాస్ హిట్ పడాలని ఆయన ఫ్యాన్స్ కోరుతున్నారు.

# చిరూకి పోటీ లేనట్టే..!



సౌత్‌లో సినిమాలకు మంచి సీజన్ అంటే సంక్రాంతే. ఆ సీజన్‌లో సినిమాలను రిలీజ్ చేస్తే మంచి కలెక్షన్లు వస్తాయి. సంక్రాంతికి సెలవులుండటంతో పాటూ ఆడియన్స్ ప్రేక్షకులతో థియేటర్లకు వెళ్లాలనుకుంటారు కాబట్టి అందరి చూపూ సంక్రాంతిపైనే ఉంటుంది. అందుకే సంక్రాంతి కోసం అందరూ ఎంతో ముందుగానే కర్ఛీఫ్ వేసుకుంటారు. ఈ ఇయర్ సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన వెంకటేష్ ఆ సినిమాతో ఏ రేంజ్ సక్సెస్ ను అందుకున్నాడో ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. కేవలం కలెక్షన్లను దృష్టిలో పెట్టుకునే నిర్మాతలు తమ సినిమాలను పండక్కి తీసుకు రావాలనుకుంటారు. అయితే ఈసారి 2026 సంక్రాంతికి ఎప్పటికంటే కాస్త ముందుగానే బెర్తులు కన్ఫర్మ్ అయిపోయాయి. వాటిలో అన్నింటికంటే ముందు రిలీజ్ డేట్‌ను కన్ఫర్మ్ చేసుకున్న సినిమా ఎన్టీఆర్ నీల్ మూవీ. 2026, జనవరిలో తమ సినిమా వస్తుందని ఆ చిత్ర నిర్మాతలు సినిమాను అనౌన్స్ చేస్తూనే చెప్పారు. ఆ తర్వాత మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కలయికలో తెరకెక్కుతున్న మెగా157 కూడా సంక్రాంతికే వస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. దీంతో పండక్కి ఎన్టీఆర్, చిరూ మధ్య పోటీ తప్పదనకున్నారంతా. కానీ ఇప్పుడు సడెన్‌గా ఎన్టీఆర్ నీల్ సినిమా పండగ రేసు నుంచి తప్పుకుంది. తమ సినిమా జూన్25, 2026న రిలీజ్ కానుందని ఎన్టీఆర్‌నీల్ చిత్ర యూనిట్ అధికారికంగా అనౌన్స్ చేయడంతో ఆ సినిమా పండగ సీజన్ నుంచి తప్పుకున్నట్టైంది. సో ఇప్పుడు సంక్రాంతికి ఫిక్స్ అయిన సినిమా అనిల్ రావిపూడి దర్శకత్వంలో చిరూ చేస్తున్న సినిమా ఒక్కటే. మెగా157 కాకుండా నెక్స్ట్ పొంగల్‌కు మరే పెద్ద హీరో నుంచి సినిమా వచ్చేట్టు కనిపించడం లేదు. వెంకటేష్, రవితేజ సినిమాలు సంక్రాంతికి టార్గెట్ చేస్తున్నాయంటున్నారు కానీ ఇంకా వారి సినిమాలు మొదలుకూడా కాని నేపథ్యంలో అవి ఎంతవరకు రిలీజవుతాయనేది చెప్పలేం. దిల్ రాజు బ్యానర్ నుంచి నితిన్ ఎల్లమ్మ, నవీన్ పోలిశెట్టి అనగనగా ఒక రాజు లాంటి సినిమాలు రేసులోకి వస్తాయంటున్నారు కానీ మెగా 157 హైప్ ముందు ఆ సినిమాలు చాలా చిన్నవి. ఎన్టీఆర్ పోటీ నుంచి తప్పుకోవడంతో తమ హీరో సినిమాకు పోటీనే లేదని మెగా ఫ్యాన్స్ సంబర పడుతున్నారు.

# రేర్ ఫీట్‌ను సాధించిన మోహన్ లాల్



మలయాళ సూపర్ స్టార్ మోహన్ లాల్ ఎన్నో సూపర్ హిట్ సినిమాలు చేసి ఎంతోమంది ప్రేక్షకుల్ని సంపాదించుకున్నాడు. మోహన్ లాల్ సృష్టించిన రికార్డులు, ఆయన సాధించిన ఫీట్లు మామూలువి కావు. రీసెంట్‌గా ఎల్2 ఎంపురాన్ తో బ్లాక్ బస్టర్ అందుకున్న మోహన్ లాల్, ఆ సినిమాతో మలయాళంలో రికార్డులు సృష్టించాడు. ఎల్2 ఎంపురాన్ తర్వాత మోహన్ లాల్ నుంచి మరో సినిమా వచ్చింది. అదే తుదరుమ్. ఆరు పదుల వయసులో కూడా మోహన్ లాల్ యంగ్ హీరోలకు పోటీగా సినిమాలు చేస్తూ మలయాళ ఆడియన్స్‌తో పాటూ తెలుగు ప్రేక్షకుల్ని కూడా మెప్పిస్తూ వస్తున్నాడు. వరుసగా సినిమాలు చేస్తూ వాటితో రికార్డులు సృష్టిస్తున్న మోహన్ లాల్ ఇప్పుడు మరో అరుదైన రికార్డును సాధించాడు. కేరళలో మొదటి నాలుగు రోజుల్లో అత్యధిక ఆడియన్స్‌ను సొంతం చేసుకున్న సినిమాలు మూడు ఉండగా, ఆ మూడు సినిమాలూ మోహన్ లాల్‌వే అవడం విశేషం. టాప్3లో మొదటిగా ఎల్2: ఎంపురాన్ ఫస్ట్ ప్లేస్‌లో ఉంది. ఈ సినిమాను మొదటి నాలుగు రోజుల్లో ఏకంగా 25. 65 లక్షల మంది సందర్శించారు. మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా అందరి ప్రశంసలు అందుకుని సూపర్ హిట్‌గా నిలిచింది. ఈ సినిమా బ్లాక్ బస్టర్ లూసిఫర్‌కు సీక్వెల్‌గా తెరకెక్కింది. ఇక రెండో స్థానంలో లూసిఫర్ సినిమా ఉంది. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలోనే తెరకెక్కిన ఈ సినిమా రిలీజ్ అయిన టైమ్‌లో మలయాళ ఇండస్ట్రీలో సెన్సేషన్ సృష్టించిన విషయం తెలిసిందే. ఈ మూవీని మొదటి నాలుగు రోజుల్లో 18 లక్షల మంది సందర్శకులు వీక్షించారు. ఈ సినిమాను తెలుగులో గాడ్ ఫాదర్ పేరుతో మెగాస్టార్ చిరంజీవి రీమేక్ చేశాడు. ఇక మూడో ప్లేస్‌లో తుదరుమ్ సినిమాను 17 లక్షల మంది సందర్శకులు వీక్షించారు. మోహన్ లాల్ ఈ అరుదైన ఫీట్‌ను సాధించడం పట్ల ఆయన ఫ్యాన్స్ ఫుల్ ఖుషీగా ఉన్నారు.

# లబ్ధిదారులకు సమయానికి ధ్రువీకరణ పత్రాలు అందించాలి

## - ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు కృషి : ఎంపీడీవో శ్రీనివాసరావు





**అల్లూరి జిల్లా, చింతపల్లి, (రాజధాని వార్తలు):** లబ్ధిదారులకు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలను ఆలస్యం లేకుండా నిర్దిష్ట సమయంలో అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చింతపల్లి ఎంపీడీవో యు.వి.ఎస్. శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సమావేశం అల్లూరి జిల్లా కలెక్టర్ ఏ.ఎస్.దినేష్ కుమార్, జిల్లా పరిషత్ సీఈవో ఆదేశాల మేరకు నిర్వహించబడినదిగా తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ సామాజిక పించన్ల పంపిణీ, కొత్త పింఛన్ దారుల గుర్తింపు, ఆధార్ నమోదు, ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్, పీఎం జెజెవై, పీఎం వీవై, పీఎం ఎస్‌బీవై, పిజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ వంటి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం లేకుండా కార్యదర్శులు ముందు వరుసలో ఉండాలని సూచించారు. అలాగే, మారుమూల గిరిజన గ్రామాల్లో దోమల వ్యాప్తిని అడ్డుకునేందుకు స్ప్రేయింగ్ కార్యక్రమాలను చురుకుగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉన్నదని తెలిపారు. మన మిత్ర కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ విధంగా ప్రజలకు అందుబాటులో ఉండే సేవల్ని సమర్థంగా అందించాలన్నారు. మన మిత్రలో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో పునరుద్ఘాటించారు. ఈ సమీక్ష సమావేశంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి కమిటీ, మండల స్థాయి కమిటీలు జిల్లా కలెక్టర్ ద్వారా ఏర్పాటు



**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** దర్తీ అబ జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం (డిఏజెజియుఏ) ద్వారా అనకాపల్లి జిల్లాలో ఆరు మండలాలు 10 గ్రామాలు గుర్తించబడినవని జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణ రావు తెలిపారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పథకం అమలుపై డిఆర్ఓ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.సత్యనారాయణరావు మాట్లాడుతూ గిరిజనుల యొక్క సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపరచడం, 17 శాఖల నందు గల అంతరాలను గుర్తించి ఆయా గ్రామాలలో మౌలిక సదుపాయాలను సంతృప్తి స్థాయిలో కల్పించడం, గిరిజనులను సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈరోజు జిల్లా స్థాయి కమిటీ మరియు మండల స్థాయి కమిటీలు జిల్లా కలెక్టర్ ద్వారా ఏర్పాటు చేయడం జరిగినదన్నారు. ఈ పథకమునందు జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్ గాను మిగిలిన 17 శాఖల అధికారులు మెంబర్లు గాను ఉంటారని, మండల స్థాయిలో మండల అభివృద్ధి అధికారి చైర్మన్ గాను మరియు ఇతర మండల స్థాయి అధికారులు మెంబర్లుగా ఉంటారని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో గ్రామాల యొక్క అవసరాలను (రోడ్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా త్రాగునీరు, విద్యుదీకరణ, సోలార్ విద్యుత్, అంగన్వాడి కేంద్రాలు, హాస్టల్స్ నిర్మాణం మొదలైనవి) మరియు గిరిజనుల యొక్క వ్యక్తిగత అవసరాలను (ఆధార్ , ఆయుష్మాన్ నమోదు, ఎల్పిజి సిలిండర్ సదుపాయం, వ్యక్తిగత గృహాలు మొదలైనవి) గుర్తించి వాటిపై నివేదిక తయారుచేసి తగిన అనుమతులు తీసుకొని వారి అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఈ పథకం క్రింద నాతవరం మండలంలో సరుగుడు, రావికమతం మండలంలో చీమలపాడు, కొట్నాబిల్లి, మాడుగుల మండలంలో శంకరం, తాటిపర్తి, చీడికాడ మండలంలో కోనాం, దేవరాపల్లి మండలంలో వాలబు, సమ్మెట, చింతలపూడి, నక్కపల్లి మండలంలో చీడిక గ్రామాలను గుర్తించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ శిరీష, డుమా పీడీ పూర్ణిమ దేవి, డిఆర్డిఏ ప్రాజెక్టు అధికారి శచిదేవి, ఐసిడిఎస్ పిడి అనంతలక్ష్మి, బీసీ వెల్ఫేర్ డిడి రాజేశ్వరి, డి ఎల్ డి ఓ మంజులవాణి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, నీటిపారుదల, గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వర్షానికి రోడ్లు జలమయం - పట్టించుకోని పంచాయతీ పాలక వర్గం, అధికారులు



**పాయకరావుపేట, (రాజధాని వార్తలు):** మండలంలోని పాల్తేరు గ్రామంలో చిన్నపాటి వర్షానికి రోడ్లు జలమయమవుతున్నాయి. ముఖ్యంగా గ్రామంలోని 4 వార్డులో కోలా వారి వీధిలో బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి రోడ్డు మొత్తం మునిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి సమస్య ఉన్నప్పటికీ పంచాయితీ పాలకవర్గం కానీ, అధికారులు కానీ పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా రోడ్డు మునిగిపోయి, రోడ్డు ఎక్కడుందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారని ప్రజలు చెప్తున్నారు. కురిసిన వర్షంతో పాటు, కాలవల్లో ఉన్న మురికి నీరంతా రోడ్డు పైకి వచ్చి తీవ్ర దుర్వాసన వస్తున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ పాలక వర్గం, అధికారులు చర్య తీసుకుని వర్షం నీరు రోడ్డుపై నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# స్త్రీలు రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తినింపారు

## - డిసిసిబి అధికార బృందం - మేము సైతం రక్తదానంలో కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగులు






**(శ్రీకాకుళం, (రాజధాని వార్తలు):** ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఇయర్ సందర్భంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్ర సహకారంతో నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉద్యోగులు, సహకార సంఘముల ఉద్యోగులు రక్తదాన శిబిరంలో పాల్గొని, రక్తదానం చేశారని, పురుషులకు ధీటుగా, స్త్రీలు ముందుకువచ్చి రక్తదానం చేసి అందరిలో స్ఫూర్తినింపారని బ్యాంకు అధికారులు తెలిపారు. ముఖ్యంగా నగరంలో రక్త కొరత కారణంగా, ఒక మంచి కార్యక్రమం చెయ్యాలనే ఉద్దేశ్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించామన్నారు. రెడ్ క్రాస్ సెక్రటరీ బలివాడ మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నే షనల్ కో-ఆపరేటివ్ ఇయర్ సందర్భంగా రక్తదానం చెయ్యటం హర్షణీయమని, వేసవిలో రక్త నిల్వలు తక్కువ ఉంటాయని, సామాజిక బాధ్యతతో ఆలోచించి రక్తదానం చెయ్యటమే కాకుండా, స్త్రీలు కూడా మానవతా దృక్పథంతో అలోచించి రక్తదానం చెయ్యటం మాటలకందని విషయమన్నారు. ఇప్పటి వరకు సుమారు వంద మంది ఉద్యోగులు రక్తదానం చేశారని రెడ్ క్రాస్ బృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి అధికార ఉద్యోగులు, రక్తదాతలు, రెడ్ క్రాస్ జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి. చైతన్య, పీఆర్వో సత్యన్నారాయణ, శాశ్వత సభ్యులు బి.చిన్మయ రావు, ఎపిఆర్వో నంది. ఉమా శంకర్, బి.జగదీశ్ ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ గౌరీ గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనకాపల్లి శ్రీ గౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ తరగతులు మే 1 ఉదయం 9 గంటల నుంచి జరగనున్నాయని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ గౌరీ గ్రంథాలయం వివేకానంద ఛారిటబుల్ ట్రస్టు కంప్యూటర్ హాలులో జరగనున్న ఈ తరగతులు మే 30వ తేదీ వరకు జరుగుతాయి. సర్టిఫికేట్ ఇన్ కంప్యూటర్ కాన్సెప్ట్స్, ఎం.ఎస్-ఆఫీస్, ఎం.ఎస్.-వర్డ్, ఎం.ఎస్-ఎక్సెల్, ఎం.ఎస్.పవర్ పాయింట్, ఇంటర్నెట్ కాన్సెప్ట్స్ మొదలగు కోర్సులకు శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు. ప్రతిరోజు థియరీ, ప్రాక్టికల్స్ కూడా జరుగుతాయన్నారు. నామమాత్రపు ఫీజు మాత్రం శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు చెల్లించాలన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వర్గాల వారు శిక్షణకు హాజరు కావచ్చు.

శిక్షణ అనంతరం జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయుటకు అనుగుణమైన అర్హులకు సర్టిఫికేట్ జారీ చేయడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వివరాలకు మొబైల్ నెంబర్లు 92471 87355, 92471 66511లను సంప్రదించాలని గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబును సన్మానించిన డిసిఎంఎస్ చైర్ పర్సన్ కోట్ని బాలాజీ

**బుచ్చయ్యపేట, (రాజధాని వార్తలు):** ఉమ్మడి విశాఖ జిల్లా (డిసిఎంఎస్ కోపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ ఈరోజు వడ్డాది తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ & అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబుని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడువాడ రమణ, దూది రాజేష్, దొండా నానాజీ, మొదలగువారు పాల్గొన్నారు.



# మోహన్ రావు సేవలు శ్లాఘనీయం

## - జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్





**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ ఉద్యోగి విజయవంతంగా విధి నిర్వహణ సాగించాలంటే వృత్తి పట్ల నిబద్ధత సమయస్ఫూర్తి కలిగి ఉండాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ప్రసాద్ చెప్పారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గల మత్స్యశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ పొడుగు మోహన్ రావు పదవీ విరమణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోహన్ రావు ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరు మన్నులు అందుకొని నేడు ఉద్యోగ విరమణ చేస్తున్నందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. మోహన్ రావు సేవలను కొనియాడారు. అనంతరం మోహన్‌రావు దంపతులను కార్యాలయ అధికారి, సిబ్బంది కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు ఘనంగా సత్కరించారు.

అనంతరం సన్మాన గ్రహీత మాట్లాడుతూ అధికారులు తోటి ఉద్యోగుల సహకారంతోనే 33 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలను సాఫీగా నిర్వర్తిం చగలిగానని తన అనుభవాలను తెలియచేశారు. ఈ కార్యక్ర మంలో అనకాపల్లి మత్స్య శాఖ కార్యాలయ సిబ్బంది కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan